






ప్రగతి సంతకం

అద్దంలా మెరిసే రహదారులు.. అందుబాటులోనే అత్యాధునిక వైద్యసేవలు.. కార్పొరేట్ విద్యాసంస్థలను తలదన్నే రీతిలో పాఠశాలలు.. అంతిమ సంస్కారాలకు అవస్థల్లేకుండా కైలాసభూముల్లో వసతులు.. పేదల వేడుకలకు వేదికగా సామాజిక భవనాలతో 85వ వార్డు ప్రగతికి చిరునామాగా మారింది. ఒకటీ..రెండూ కాదు ఏకంగా రూ.27 కోట్లతో వార్డులో విస్తృతస్థాయిలో పనులు చేపట్టారు. కనీవిని ఎరుగని రీతిలో జరిగిన అభివృద్ధిపై వార్డువాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- 85వ వార్డులో అభివృద్ధి పరవళ్లు
- రూ.27 కోట్లతో విస్తృతంగా పనులు
- రహదారులకు మహర్దశ
- అద్భుతమనిపించేలా ఆస్పత్రులు, విద్యాలయాలు



అగనంపూడి హైస్కూల్‌లో నిర్మించిన అదనపు తరగతి గదులు

ఏరియా ఆస్పత్రి అభివృద్ధి రూ.16.5 కోట్లు
అగనంపూడి హైస్కూల్ రూ.1.7 కోట్లు
లంకెలపాలెం యూపీహెచ్‌సీ నిర్మాణం రూ.98 లక్షలు
సామాజిక భవనాల నిర్మాణం రూ.88.5 లక్షలు
కైలాసభూముల్లో వసతులు రూ.1.28 కోట్లు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. మునుపెన్నడూ లేనివిధంగా ప్రగతి బాటలో పరుగులు పెడుతోంది. ప్రాథమిక వసతుల దశ దాటి అభివృద్ధి పనులతో వార్డు శరవేగంగా దూసుకుపోతుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రూ. 27 కోట్లతో వార్డును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అపరిష్కృత సమస్యలు పరిష్కారం అవడంతో పాటు దీర్ఘకాలంగా ఉన్న రహదారుల పునర్నిర్మాణం సాకారమైంది. కైలాస భూముల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనులు, సుందరీకరణతో మహర్దశ పట్టింది. ఒకప్పుడు ముళ్ల తుప్పలు, పందుల గుంపులు, చెత్తా చెదారంతో నిండిపోయిన శ్మశానాలు ఇప్పుడు రూపురేఖలు మారిపోయాయి. దహన సంస్కారాలకు ఇబ్బంది లేకుండా అన్ని వసతులు సమకూరాయి. ఇక నాడు–నేడు కార్యక్రమంలో ఆస్పత్రులు, పాఠశాలల ఆధునీకరణ, సుందరీకరణ పనులు చేపట్టారు. గోతులతో నిండిన రోడ్లు మరమ్మతులు చేయగా, మరికొన్ని చోట్ల పునర్నిర్మాణం చేపట్టారు. వార్డులోని ప్రతీ గ్రామంలో సదుపాయాలు సమకూరడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి ఇలా..

- 'నాడు–నేడు' లో భాగంగా అగనంపూడి ఏరియా ఆస్పత్రిని రూ.16.50 కోట్లతో వంద పడకలుగా తీర్చిదిద్దుతున్నారు. మార్చురీ, రక్త నిధి, అధునాతన ల్యాబ్, ఆపరేషన్ థియేటర్ వంటి వసతులు కల్పిస్తున్నారు.
- అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు విడతల్లో రూ. ఒక కోటి 70లక్షలతో మరుగుదొడ్లు, నీటి వసతి కల్పించారు. బెంచీలు ఏర్పాటు చేశారు. అదనపు తరగతి గదులు నిర్మించారు.
- లేమర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.60లక్షలతో కనీస సౌకర్యాలు అదనపు వసతులు కల్పించారు.
- పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాలు, ఇతర వసతుల ఏర్పాటుకు రూ.43లక్షలు
- లంకెలపాలెం వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి రూ.98లక్షలు
- దొంకాడ కాలనీలో డ్రైనేజీ నిర్మాణానికి రూ. 20 లక్షలు వెచ్చించారు.
- గంగిరెడ్ల కాలనీ, గెంజిపేట, శ్రీరామ్‌నగర్ కాలనీ, లేమర్తి, ఈ బోనంగిల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.99లక్షల 10వేలు
- అండమాన్ కొండయ్యవలస, దిబ్బపాలెంల్లో కాంపౌండ్‌వాల్స్ నిర్మాణానికి రూ. 49.80లక్షలు
- ఈ.మర్రిపాలెం కూడలి నుంచి ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీ వరకు సీసీరోడ్డు విస్తరణకు రూ. 54లక్షలు
- వార్డులో ప్యాచ్‌వర్క్‌లకు రూ.19.60లక్షలు
- మంత్రిపాలెం, తలారివానిపాలెంల్లో కైలాస భూముల కాంపౌండ్‌వాల్స్, షెడ్లు, ఇంటర్నల్ రోడ్లు, మంచినీరు ఇతర వసతులకు రూ.కోటి 28లక్షలు వెచ్చించారు.
- కొత్తూరు, సెక్టార్–2, బీసీ కాలనీల్లో వరద నీటి కాల్వలకు రూ.70లక్షలు ఖర్చు పెట్టారు.
- మంత్రిపాలెం, కొండయ్యవలసల్లో రూ.88 లక్షలు 50వేలతో సామాజిక భవనాలు నిర్మించారు.
- దిబ్బపాలెంలో రూ.19.90 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం జరిగింది.
- తలారివానిపాలెం,బీసీ కాలనీ, పెదమడకల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.60 లక్షలు ఖర్చు చేశారు.
- ఫార్మాసిటీ కాలనీ, మంత్రిపాలెం, శ్రీరామ్‌నగర్ కాలనీల్లో రూ.70.40 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం జరిగింది.

రోడ్లు అద్దంలా ఉన్నాయి



అనతికాలంలోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు కళ్లెదుట సాక్షాత్కరిస్తున్నాయి. రహదారులు విస్తరిచారు. మరికొన్ని రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. జాతీయ రహదారి నుంచి ఫార్మాసిటీ కాలనీకి వెళ్లే మార్గం గతంలో ఇరుగ్గా, వంకర్లతో ఉండేది. దీంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకునేవి. ఇప్పుడు ఆ రహదారిని విస్తరించడం వల్ల రాకపోకలను అనువుగా మారింది. హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రికి వచ్చే రోగులతో రహదారి రద్దీగా ఉండేది. రహదారిని విస్తరించడంతో ట్రాఫిక్ కష్టాలు తప్పాయి. సుమారు అన్ని గ్రామాల్లో రహదారులు పునర్నిర్మించడంతో అద్దంలా మెరుస్తున్నాయి.

– ఎం.శ్రీనివాసరావు, ఫార్మాసిటీ కాలనీ

దగ్గరలోనే మంచి ఆస్పత్రులు



ఇదివరకు అత్యవసరమైతే నగరంలో ఉన్న ఆస్పత్రులకు వెళ్లలేక దగ్గరలోని ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది, వేలకు వేలు ఖర్చు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ అవసరం లేదు. మాకు దగ్గరలోనే మంచి ఆస్పత్రులు వచ్చాయి. అవసరమైన చోట యూపీహెచ్‌సీలు నిర్మించి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. అగనంపూడి ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా మార్చడం వల్ల ఎంతో మందికి అనువుగా ఉంది.

–బి.శివానంద లక్ష్మి, అగనంపూడి కాలనీ



అగనంపూడి ఏరియా ఆస్పత్రి

క్లుప్తంగా

వైభవంగా శ్రీవారి పల్లకీ సేవ



పల్లకీ సేవలో తిరుమల బాలాజీ

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీదేవి భూదేవి సమేత తిరుమలేశుని పల్లకీ సేవ నేత్రపర్వంగా జరిగింది. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పరిసర ప్రాంతాల భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోయమాంబ ఉత్సవం

అగనంపూడి: అగనంపూడి సెక్టార్–1 పినమడక, పూడివానిపాలెం, కొత్తూరు, కర్రివానిపాలెం నిర్వాసిత కాలనీల్లో బోయమాంబ అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. సెక్టార్–1 నిర్వాసితకాలనీల భక్తులు పాల్గొని అమ్మవారికి కానుకలు సమర్పించారు. సాయంత్రం అమ్మవారిని కాలనీల్లో ఊరేగించి అనుపు చేశారు. భారీస్థాయిలో బాణాసంచా కాల్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వర్ణ నూకాంబిక ఆలయానికి వంశీరెడ్డి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: 74వ వార్డు దయాల్‌నగర్ క్వారీ రోడ్డులోని స్వర్ణ నూకాంబిక అమ్మవారి ఆలయానికి కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి రూ.25వేల విరాళం అందించారు. ఆలయ అభివృద్ధి, కొత్త అమావాస్య వేడుకల నిమిత్తం ఈ మొత్తాన్ని వినియోగించాలని ఆలయ కమిటీ సభ్యులను కోరారు. ఆలయ 13 వార్షిక వేడుకల్లో భాగంగా అమ్మవారిని మంగళవారం దర్శించుకున్న వంశీరెడ్డి, శాంతిహోమంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో ఎన్వై నాయుడు, అనపర్తి త్రినాథ్, ఎస్.రాజారావు, సీకు రమణ, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరిడిమాంబ జాతర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలస గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి జాతర వివరాలతో రూపొందించిన పోస్టర్‌ను ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు మంగళవారం ఆవిష్కరించారు. రామాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బలిరెడ్డి శ్రీను మాట్లాడుతూ మరిడిమాంబ, బంగారమ్మ తల్లి అమ్మవార్ల జాతర సందర్భంగా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు, గ్రామ నాయకులు విందుల వరహాలు, మరిశా రామచంద్రరావు, బలిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

30న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 30న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

ప్రైవేటీకరణతో కార్మికులకు నష్టం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణతో కార్మికులకు తీరని నష్టం కలుగుతుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1139వ రోజు, మంగళవారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా భాగస్వామ్యంతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. దీక్ష శిబిరంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

29 నుంచి త్రిశక్తి ఆలయ వార్షిక వేడుకలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని త్రిశక్తి దేవాలయం, నవనాగ శక్తి 17వ వార్షికోత్సవాలు ఈ నెల 29 నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న వేడుకల్లో భాగంగా మొదటి రోజు 29న ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, నవనాగులకు పంచామృతాభిషేకం, మూల మంత్ర హోమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం త్రిశక్తి అమ్మవార్లకు అంకురారోపణ, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠాపన చేయనున్నారు. 30న శనివారం త్రిశక్తి అమ్మవార్లకు పంచామృత నవరస అభిషేకం, సంపూర్ణ శ్రీచక్ర నవావర్ణార్చన ఉంటాయి. అమ్మవార్ల దివ్యదర్శనం అనంతరం నవగ్రహ, నక్షత్ర హోమాలు చేయనున్నారు. అనంతరం శివ పార్వతుల దివ్య కళ్యాణం జరిపిస్తారు. 31న ఆదివారం ఉదయం చండీ హోమం, సాయంత్రం అమ్మవార్ల తిరు వీధి ఊరేగింపు జరగనుందని ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిశర్మ తెలిపారు.

16 కేజీల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో పోలీసులు

అక్కిరెడ్డిపాలెం: ద్విచక్రవాహనంలో గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం రాత్రి గాజువాక పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ వాహన తనిఖీల్లో వీరు పట్టుబడ్డారు. ఘటనకు సంబంధించిన వివరాలివి.. మాకవరపాలెంకు చెందిన సాయికుమార్ పాడేరు నుంచి గంజాయి తీసుకుని చెన్నైకు చెందిన కర్ణన్‌కు అప్పగించాడు. వారు ద్విచక్రవాహనంలో గంజాయిని తరలిస్తుండగా గాజువాక లంకా గ్రౌండ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న గాజువాక పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌కు 16 కిలోల గంజాయితో పట్టుబడ్డారు. గంజాయిని చెన్నైకు తరలించనున్నట్లు కర్ణన్ తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకుని గాజువాక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

గర్భిణులకు మెరుగైన వైద్యం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: గర్భిణులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం రేసవానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో జిల్లా ట్రైనింగ్ టీం ఆధ్వర్యంలో దక్షత శిక్షణ కార్యక్రమం జరిగింది. ఇందులో ఆయన పాల్గొని మాట్లాడారు. 3 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ప్రతి గర్భవతి 12 వారాలలోపు పేరు నమోదు చేసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్‌సీ), పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రా (యూపీహెచ్‌సీ)ల్లో ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలన్నారు. దీని కోసం పారా మెడికల్ సిబ్బంది శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. మాతా–శిశు మరణాలు నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి సేవలందించాలన్నారు. అవసరం అయితే వీరిని రిఫరల్ ఆస్పత్రులకు పంపి సేవలందిస్తామన్నారు. ఈ శిక్షణలో 10 మంది పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యులు, స్టాఫ్‌నర్స్‌లకు శిక్షణ ఇచ్చారు. నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, డాక్టర్ సమత, డాక్టర్ షర్మిల, ఐ.మనోరమ, కె.ధర్మేంద్ర, నాగభూషణం, స్టాఫ్‌నర్స్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న చెల్లుబోయిన నాయుడు

పెదగంట్యాడ: పైడిమాంబ అమ్మవారి పండగ సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన నాయుడు సహకారంతో శ్రీ పైడిమాంబ స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు పూడి సన్నీ, పీత కృష్ణ, పల్లం రవి ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఈ పోటీలు జరిగాయి. పోటీల్లో 12 జట్లు పాల్గొన్నాయి. శ్రీ పైడిమాంబ స్పోర్ట్స్ క్లబ్ ప్రథమ స్థానాన్ని, నడుపూరు జట్టు ద్వితీయ స్థానాన్ని సొంతం చేసుకోగా గొంతినవానిపాలెం జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు వరుసగా రూ.5వేలు, రూ.3వేలు, షీల్డ్, రూ.2వేలతో పాటు షీల్డ్‌లు అందించారు. చెల్లుబోయిన నాయుడు, ఉత్సవ కమిటీ చైర్మన్లు మంత్రి శంకరనారాయణ, ములగపాక అచ్చింనాయుడు బహుమతులు ప్రదానం చేశారు.

దివ్యాంగులకు వైకల్య నిర్ధారణ శిబిరం



దివ్యాంగులను పరీక్షిస్తున్న వైద్యులు

కూర్మన్నపాలెం: వడ్లపూడి భవిత కేంద్రం ఆవరణలో దివ్యాంగులకు వైకల్య నిర్ధారణ కోసం మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని డీఈవో చంద్రకళ, ఎస్ఎస్ఏ అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు, సహిత విద్య సమన్వయకర్త గీత ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో చంద్రకళ మాట్లాడుతూ దివ్యాంగులకు ఏయే ఉపకరణాలు అవసరమో గుర్తించేందుకు నిర్వహించిన ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ త్వరలోనే ఉపకరణాలు పంపిణీ చేస్తామని తెలిపారు. శిబిరంలో 150 మంది దివ్యాంగ చిన్నారులు పాల్గొన్నారు. కేజీహెచ్ ఆర్థోపెడీషియన్ రంజనికుమార్, ఫిజియోథెరపిస్ట్ తారకేశ్వరరావు, ఈఎన్‌టీ సర్జన్ నాగరాజు, నేత్ర వైద్య నిపుణుడు మనోజ్‌కుమార్ దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో గాజువాక, ములగాడ, పెదగంట్యాడ మండల విద్యాశాఖాధికారులు, అన్ని మండలాల సహిత విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇగ్నోలో అడ్మిషన్లకు గడువు పెంపు

గాజువాక : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో)లో అడ్మిషన్ల గడువును ఈ నెల 31 వరకు పెంచినట్టు వర్సిటీ గాజువాక స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్ ఎస్.వి.కృష్ణ తెలిపారు. యూనివర్సిటీ అందిస్తున్న అన్ని సర్టిఫికెట్ డిప్లమా, పీజీ డిప్లమా, ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఎంబీఏ ప్రవేశాలకు ఆసక్తి గల అభ్యర్థులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. http:// ignouadmission.samarth.edu. in ద్వారా ప్రవేశాలను పొందవచ్చని పేర్కొన్నారు. వివరాల కోసం ఎంవీఆర్ కళాశాలలోని స్టడీ సెంటర్‌లో గాని, 0891–3514734 నంబర్‌లో గాని సంప్రదించవచ్చన్నారు.

వైభవంగా పైడిమాంబ పండగ

- మిరుమిట్లు గొలిపిన దీపకాంతులు
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



పూజలందుకుంటున్న పైడిమాంబ అమ్మవారు



సాంస్కృతిక ప్రదర్శనను వీక్షిస్తున్న భక్తులు

పెదగంట్యాడ: 76వ వార్డు నడుపూరు గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి పండగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. వారం రోజులుగా గ్రామంలో పండగ కోలాహలం నెలకొంది. ఆలయాన్ని, గ్రామాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారి ఘటాలను వీధుల్లో ఊరేగించారు. పైడిమాంబ ఉత్సవ కమిటీ చైర్మన్లు మంత్రి శంకరనారాయణ, ములగపాక అచ్చింనాయుడు ఆధ్వర్యంలో సోమవారం తొలేళ్ల ఉత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన పౌరాణిక నాటకాలు విశేషంగా అలరించాయి. హాస్య వల్లరి, భజనలు, తప్పెటగుళ్లతో పాటు బుర్రకథ, రేలారే రేలా కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మంగళవారం అమ్మవారి పండగను పురస్కరించుకుని పెద్దఎత్తున భక్తులు దర్శించుకున్నారు. విశేష పూజలు చేశారు. అమ్మవారి ఘటాలను మేళతాళాలు, మంగళవాద్యాలు, బాణసంచా పేలుళ్లతో పురవీధుల్లో ఊరేగించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, రాజాన రామారావు తదితరులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బత్తిన భానుకిరణ్, బత్తిన నాగభూషణం, గెద్దం రమణ, సియ్యాద్రి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పెదమడకలో..

అగనంపూడి: 85వ వార్డు అగనంపూడి నిర్వాసిత కాలనీ పెదమడక గ్రామ ఇలవేల్పు పైడిమాంబ అమ్మవారి జాతర ఘనంగా జరిగింది. పరిసర నిర్వాసిత కాలనీల నుంచి భక్తులు హాజరై, అమ్మవారికి మొక్కులు చెల్లించారు. పసుపు, కుంకుమలు, చీర, సారె సమర్పించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, దువ్వాడ రైల్వే కన్సల్టెన్సీ కమిటీ సభ్యుడు కొలిపాక అప్పారావు, ఆలయ కమిటీ, ఇల్లపు ప్రసాద్, ఉత్సవ కమిటీల ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని విశేష పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.



పెదమడకలో అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



విద్యుద్దీపాలంకరణలో ప్రవేశ ద్వారం

శ్రీకృష్ణాపురం గురుకుల విద్యార్థుల ప్రతిభ

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు శ్రీకృష్ణాపురం గురుకులం విద్యార్థులు చిత్రలేఖనంలో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. డ్రీమ్ హార్ట్ సంస్థ విజయవాడలో 11వ ఆలిండియా చిల్డ్రన్ అండ్ యూత్ ఆర్ట్ కాంపిటేషన్ కం ఎగ్జిబిషన్ ఇటీవల నిర్వహించింది. ఈ పోటీల్లో గురుకులానికి చెందిన ఆరు నుంచి 9 తరగతుల విద్యార్థులు 50 మంది పాల్గొన్నారు. వివిధ చిత్రాలను ఆకర్షణీయంగా వేసి, ఆన్‌లైన్‌లో నిర్వాహకులకు పంపించగా.. 15 బంగారు, 15 వెండి పతకాలు సాధించినట్లు గురుకులం డ్రాయింగ్ టీచర్ పిడమర్తి సుధాకర్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఇటీవల గురుకులాన్ని సందర్శించిన సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హర్షవర్ధన్, గురుకులాల జిల్లా సమన్వయాధికారి ఎస్.రూపావతి అభినందించారు.

ఆలయ కమిటీపై అధికారులకు ఫిర్యాదు



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగాలు చేస్తూ.. నిరుద్యోగులమంటూ ఆలయ కమిటీని రిజిస్టర్ చేయించి, గ్రామదేవత జాతర పేరిట చందాలు వసూలు చేసి సొంత ఖాతాల్లో జమ చేసుకుంటున్న కొండయ్యవలస మరిడిమాంబ ఆలయ కమిటీపై చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్, దేవాదాయ శాఖఅసిస్టెంట్ కమిషనర్‌కు గ్రామ నాయకులు పట్టా రామ అప్పారావు, పిళ్లా శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. సీడబ్ల్యూసీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలస గ్రామ దేవత మరిడిమాంబ అమ్మవారి ఆలయ కమిటీ రిజిస్ట్రేషన్ చేయించే సమయంలో కొంతమంది ఉక్కు ఉద్యోగులు అధికారులను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. పండగలను పురస్కరించుకుని చందాలు వసూలు చేస్తున్నారని, సదరు మొత్తాలను వారి సొంత ఖాతాల్లో జమ చేసుకోవడం అనుమానాలకు తావిస్తోందని, ఈవిషయంలో చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పి.నరసింగరావు, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.